# ఫార్మసీతో ఉజ్వల భవిష్యత్తు

- వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి
- విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, పేరెంట్స్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 4: మండలంలోని వాగేశ్వరి కాలేజి ఆఫ్ ఫార్మసీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్‌లో బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో చేరిన నూతన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఫార్మసీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో కళాశాలలోని వసతులను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత ఫార్మాసిస్టుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఫార్మా రంగంలో తక్కువ ధరకు మంచి మందులను తయారు చేసి దేశంలో పేదలకు అందుబాటులోకి తేవాలని ఆకాంక్షించారు, విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వాగేశ్వరి విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డీఎం శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు

**7న వాగేశ్వరిలో బాడీ బిల్డింగ్ పోటీలు**

మండలంలోని రామకృష్ణకాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల7న 'మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డింగ్' పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ దామోదర్‌తో కలిసి కళాశాలలో ఆవిష్కరించారు. ఆసక్తి గల బాడీ బిల్డర్స్ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తదితరులు

# 'ఎస్సారార్' విద్యార్థులకు అవగాహన

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 4 : ఎస్సారార్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం, కళాశాల అలుమ్నీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఐఐటీ, జామ్, గేట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్, కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ బీరయ్య బైరి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఐటీ, వివిధ జాతీయ స్థాయి సంస్థలో మాస్టర్స్ కోర్సుల్లో చేరి విద్యార్థులు అభిరుచి, అంకితభావం, క్రమశిక్షణతో శాస్త్రీయ అవగాహనతో నిరంతరం సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఐఐటీ లాంటి జాతీయ స్థాయి సంస్థల్లో మాస్టర్స్ కోర్సు చేయడానికి నేటి నుంచే జామ్‌కు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు ఐఐటీ జామ్ పరీక్షకు సంబంధించిన అర్హతలు, పరీక్ష విధానం, అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలను తెలియజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం హిమబిందు మాట్లాడుతూ, విద్యార్థులు అత్యున్నత స్థాయిని చేరుకొని కళాశాల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేయాలన్నారు. ఇక్కడ రసాయనశాస్త్ర విభాగం అధ్యాపకులు భాస్కర్, శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, సాయిమధుకర్, కళాశాల అలుమ్నీ అసోసియేషన్ సెక్రటరీ, రాష్ట్ర టీజీసీజీటీఏ సెక్రటరీ సురేందర్ రెడ్డి, ట్రెజరర్ శుకూర్, అధ్యాపకులు సత్యానారాయణ, మల్లారెడ్డి, రాజు, కిశోర్, అర్చన, ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడికి సబ్సిడీ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

కొత్తపల్లి, అక్టోబర్ 4 : పట్టణానికి చెందిన చిగుళ్ల నాగరాజు అనే దివ్యాంగుడికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 50వేల విలువైన చెక్కును మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు బుధవారం అందజేశారు. చిగుళ్ల నాగరాజు వృత్తి రీత్యా మీ సేవ నడుపుతుండగా అంగవైకల్యం గల వారికి ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం (ఈఆర్ఎస్) కింద 100 శాతం సబ్సిడీతో కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు కోసం రూ. 50 వేలు చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉమారాణి సహకారంతో మంజూరవగా ఆ చెక్కును మున్సిపల్ చైర్మన్ లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి అందించారు.ఇక్కడ మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్ వాసాల రమేశ్, చింతల సత్యనారాయణరెడ్డి, వేముల కవిత–చంద్రశేఖర్, స్వర్గం నర్సయ్య, గున్నాల రమేశ్, సుంకె సత్యం పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ దిగజారుడు మాటలు మానుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, అక్టోబర్ 4: ప్రధాని మోదీ దిగజారుడు మాటలు మాట్లాడడం సరైనది కాదని, ప్రధాని హోదాలో ఉండి హుందాగా వ్యవహరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్షల అవినీతికి పాల్పడిందని ఆరోపణ చేయడం సరైనది కాదన్నారు. ఒకవేళ అవినీతికి పాల్పడితే రుజువు చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఎద్దేవా చేశారు. బీజేపీని అంతమందించేందుకే సీపీఐ పోరాటాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం ఇచ్చినప్పటికీ వారి వైఖరిలో స్పష్టత లేదన్నారు. వ్యక్తిగత పోకడలకు పోకుండా ప్రజలు గుర్తించే విధంగా వ్యవహరించాలని హితవు పలికారు. కాంగ్రెస్ తో వామపక్షాలు పొత్తు గూర్చి చర్చలు జరుగుతున్నాయని, సీట్ల సర్దుబాటుపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. ఈ నెల 8,9,10వ తేదీలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పొత్తులపై స్పష్టత వస్తుందన్నారు. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకైనా వామపక్షాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, సహాయ కార్యదర్శి అందె చిన్నస్వామి, జిల్లా నాయకులు గూడెం లక్ష్మి, అందె స్వామి, ముద్రకోల రాజయ్య, తేరాల సత్యనారాయణ, ఎలగందుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చల్లూరులో పోచమ్మ బోనాలు



బోనాలతో పోచమ్మ గుడికి వెళ్తున్న మహిళలు, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కుమారస్వామి

వీణవంక, అక్టోబర్ 4: చల్లూరు గ్రామంలో బుధవారం పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు బోనమెత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య, శివసత్తుల పూనకాలతో పురవీధుల గుండా తరలివెళ్తుండగా యువకులు, పెద్దలు, పిల్లలు నృత్యం చేస్తూ సందడి చేశారు. పోచమ్మతల్లి గుడికి చేరుకొని బోనాన్ని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించారు. ఇక్కడ పద్మశాలీ సంక్షేమ సంఘం గ్రామాధ్యక్షుడు గంజి కుమారస్వామి, వార్డు సభ్యులు గంజి రాజు, గంజి రాజమణి–శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు లిస్టులో అభ్యంతరాలుంటే తెలుపాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సీహెచ్ రాజు

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 4: మానకొండూర్ తహసీల్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు అన్ని మండలాల ఓటరు లిస్టులను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్లు, అందులో క్లైమ్స్, అబ్జెక్షన్స్ ఉంటే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ప్రతి వారం సమావేశాన్ని నిర్వహిస్తూ, అన్ని వివరాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ నవాజ్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సమీనా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# యశోదలో అరుదైన గుండె శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ సత్యశ్రీధర్

విద్యానగర్, అక్టోబర్ 4 : హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి ఓ మహిళకు కొత్త జీవితాన్ని అందించినట్లు కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సత్యశ్రీధర్ తెలిపారు. బుధవారం స్థానిక యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరీంనగర్ పట్టణానికి చెందిన 54 సంవత్సరాల చెన్నూరి లత గుండె దడ, నడిస్తే ఆయాసం, గట్టిగా ఊపిరి పీల్చుకోని పరిస్థితిలో ఏడాది క్రితం హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద దవాఖానకు వచ్చిందని తెలిపారు. ఆమెకు ఈసీజీ, 2డీ ఎకో, యాంజియోగ్రామ్ నిర్వహించగా పదే పదే గుండెపోటు వచ్చి గుండె వ్యాకోచం చెందిందని గుర్తించి, కార్డియాక్ రీమోడలింగ్ చికిత్స ద్వారా గుండె పరిమాణాన్ని తగ్గించారనానరు. ఆరు గంటల పాటు సాగిన ఈ శస్త్ర చికిత్సలో బైపాస్ సర్జరీ, కార్డియాక్ అనాటమీ పునరుద్ధరణ, మిట్రల్ వాల్వ్ రిపేర్ తదితర ప్రక్రియలు జరిపి అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. గుండె వైఫల్యం అనేది అతికొద్ది మందికి మాత్రమే వస్తుందన్నారు. గుండె వైఫల్యం చెందితే అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. లత పూర్తి ఆరోగ్యంగా జీవిస్తుందన్నారు. ఇటీవలె ఆమె అమెరికా వెళ్లి వచ్చిందని గుర్తుచేశారు. సాధారణ మందులతో మునుపటి లాగా ఆనందమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. అనంతరం లత మాట్లాడుతూ... తాను బతుకుతానని అనుకోలేదని, యశోద వైద్యులు అందించిన వైద్య సేవలతో సాధారణ జీవితాన్ని గడపడం సంతోషంగా ఉందన్నారు.